శనివారం । తెలంగాణ
21 ఫిబ్రవరి 2026

# నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

## ఆత్మహత్యకు యత్నించిన రైతు
# చికిత్స పొందుతూ మృతి

**కోహెడ, ఫిబ్రవరి 20 (నినాదం) :** కోహెడ మండలం శనిగరం గ్రామానికి చెందిన గునిగంటి కుమారస్వామి (వ్యవసాయదారు) వ్యవసాయం ద్వారా జీవనం సాగిస్తున్నాడు. గత కొన్ని సంవత్సరాలుగా పంటలకు సరైన దిగుబడి రాకపోవడంతో పాటు అప్పులు పెరిగిపోవడంతో మనస్తాపానికి గురై క్రిమిసంహారక మందు సేవించాడు. అనంతరం అతన్ని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. తన భర్త మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని భార్య అంజలి తెలిపారు.

# అనుమానస్పదంగా వ్యక్తి మృతి.

**చేవెళ్ల ఫిబ్రవరి 20 (నినాదం ):** అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన ఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చేవెళ్ళ సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం శంకర్పల్లి మండలం పర్వేద గ్రామానికి చెందిన నారె గూడెం అంజమ్మ, కుమారుడు నారె గూడెం కృష్ణ, వయస్సు 35 సంవత్సరాలు,గత కొంతకాలంగా చేవెళ్ల పట్టణంలోని చంద్రారెడ్డి కాలనీలో కూలి పని చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. శుక్రవారం నారె గూడెం , కృష్ణ అనుమాన స్పదంగా మృతి చెందాడు. మృతుడు తల్లి నారె గూడెం అంజమ్మ నా కొడుకు మృతికి కోడలు రాజేశ్వరిపై అనుమానం ఉందని ఫిర్యాదు చేసారు. ఈమెరకు చేవెళ్ల పోలీసులు తల్లి నారె గూడెం అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారని తెలిపారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న
# ఉప సర్పంచ్
– లకావత్ సవేందర్



**మల్హర్, ఫిబ్రవరి 20 (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని కొయ్యూరు గ్రామ ఉప సర్పంచ్ లకావత్ సవేందర్, ఆధ్వర్యంలో శుక్రవారం పవిత్ర రంజాన్ మాసం ఆరంభం సందర్భంగా కొయ్యూరు లో ముస్లిం మత పెద్దలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి పండ్లు పంపిణీ చేశారు. కులమతాలకు అతీతంగా ప్రతీ ఒక్కరు సోదరభావంతో మెలగాలని పవిత్ర రంజాన్ మాసం ప్రారంభ రోజున తన వంతుగా ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు ఎండి అయూబ్ ఖాన్, మోర్బబ్, హోలీ, జాకీర్, అతిక్, షారుక్ ఖాన్, ఫెరోజ్ ఖాన్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## ముల్కనూర్ సొసైటీ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డికి వ్యవసాయ నవోత్తేజ పురస్కారం




**భీమదేవరపల్లి ఫిబ్రవరి 20 (నినాదం):** ముంబాయిలోని తాజ్ ల్యాండ్స్ ఎండ్ హోటల్‌లో గ్లోబల్ సలహా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యవసాయ నవోత్తేజ మహాసభలో ముల్కనూర్ సొసైటీ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డికి వ్యవసాయ నవోత్తేజ పురస్కారం లభించింది. వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలు, సుస్థిర విధానాలను అమలు చేస్తూ రైతులకు లాభదాయకమైన సాగు పద్ధతులు అందిస్తున్నందుకు గాను ఈ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా పార్థా ప్రతీమ్ దాస్ చేతుల మీదుగా ఆయనకు పురస్కారం ప్రదానం చేశారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా ఆధునిక సాంకేతికతతో పాటు సుస్థిర వ్యవసాయాన్ని మరింత విస్తరించేందుకు కృషి చేస్తానని అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.

## కొత్త జీవితానికి శ్రీకారం
## పట్టుచీరలతో సత్కారం



**మల్లాపూర్, ఫిబ్రవరి 20 (నినాదం) :** ఆడబిడ్డ పెళ్లికి పట్టు చీరను అందజేసిన వాల్గొండ తాండ సర్పంచ్ ధరంసోత్ సురేందర్. వాల్గొండ తాండలో స్థానిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గ్రామంలోని నూతన వధువుకు (ప్రతి ఆడ బిడ్డకు) పెళ్ళి పట్టు చీరను అందజేస్తానని అన్నారు. అందులో భాగంగా శుక్రవారం నూతన వధూవరులకు సర్పంచ్ ధరంసోత్ సురేందర్ కానుకగా పట్టు చీరను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బానావత్ శ్రీనివాస్, వార్డు సభ్యురాలు గుగ్లావత్ కమల, నాయకులు రాజేష్, సతీష్, గణేష్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో చదివితేనే ఉన్నత శిఖరాలకు..



ధర్మారం ఫిబ్రవరి 20 (నినాదం) క్రమశిక్షణ తో చదివితేనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటామని చదువు అనేది పరీక్షలకు మాత్రం కాదని ప్రతి విద్యార్థి గ్రహించాలని చదువు జీవితంలో ఎంతో ఉపయోగపడుతుందని, ప్రముఖ న్యాయవాది మకారి రాజేశం ఉన్నాడు ఈరోజు కొత్తూరు ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని అందజేసిన సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి, పై విధంగా అన్నాడు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ సమయపాలనతో చదివినట్లయితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని నేను కూడా అలాగే పట్టుదల క్రమశిక్షణతో చదివి ఈ స్థాయికి వచ్చానని, ముఖ్యంగా ఆత్మవిశ్వాసం కోల్పోవద్దని అన్నాడు. విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు మొదలగునవి అందించాడు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కే సత్యం పి మురళి ఆర్ శ్రీనివాసచారి కనకయ్య మధుకర్ శేషగిరిరావు నాగయ్య గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# వార్డు సభ్యుల శిక్షణ విజయవంతం
## మొదటి బ్యాచ్‌కు ఎంపీడీవో చేతుల మీదుగా సర్టిఫికెట్ల ప్రదానం



అశ్వాపురం, ఫిబ్రవరి 20 (నినాదం): గ్రామాల అభివృద్ధి, పారదర్శక పాలన లక్ష్యంగా నిర్వహించిన వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమం అశ్వాపురం మండలంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయము ఆవరణ లో విజయవంతంగా పూర్తైంది. ఈ శిక్షణలో పాల్గొన్న మొదటి బ్యాచ్ వార్డు సభ్యులకు ఎంపీడీవో ముత్యాలరావు సర్టిఫికెట్లు అందజేశారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో వార్డు సభ్యుల పాత్ర, గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలు విధానం, ప్రభుత్వ పథకాల అవగాహన, ప్రజా సమస్యల పరిష్కారంపై శిక్షణలో సమగ్రంగా మార్గనిర్దేశనం చేశారు. గ్రామ స్థాయిలో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవహారం, ప్రజలతో సమన్వయం వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ముత్యాలరావు మాట్లాడుతూ, "వార్డు సభ్యులు గ్రామాభివృద్ధికి కీలక భాగస్వాములు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి" అని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న సభ్యులు తమ బాధ్యతలను మరింత చురుకుగా నిర్వర్తిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూ డి సి పద్మావతి,సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్వశక్తి భవనాలకు భూమి పూజ



**భీమదేవరపల్లి ఫిబ్రవరి 20 (నినాదం);** మహిళలు ఆర్థికంగా ఎదగాలి. అందుకు గ్రామ సంఘాల భవనాలు కీలకమని ఎంపీడీవో వీరేశం అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం లోని కొత్తకొండ, ముల్కనూర్, వంగర మరియు రంగయ్యపల్లి వివో భవనాలకు భూమి పూజ పనులు ప్రారంభించారు . గ్రామీణ ప్రాంతాలలోని మహిళలకు సమావేశాలు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు సొంతభవనాలు చాల అవసరమన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏ.ఈ వినయ్ ఏపీఎం.వేణు మార్కెటింగ్ వైస్ చేర్మెన్ బొక్కల స్రవంతి కొత్తకొండ సర్పంచ్ సిద్ధమల్ల రమ రమేష్, ముల్కనూర్ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి వంగర సర్పంచ్ గజ్జెల సృజన రమేష్ రంగయ్యపల్లి సర్పంచ్ మండల రజిత మహేష్ గార్ల సీసీలు పి.అశోక్ బి.కర్ణాకర్, వి.సదానందం పంచాయతీ కార్యదర్శులు,కొత్తకొండ వేణు గోపాల్ రెడ్డి ,రంగయ్యపల్లి,నిరంజన్ రెడ్డి మండల సమాఖ్యఅధ్యక్షురాలు షబానా బేగం గ్రామసంఘాలఅద్యక్షురాళ్ళుకవిత,సబిత వివోఎలు అమరావతి,సుమలత,సరిత, సునిత,పరమేశ్వరి,కవిత,రసజ్ఞ,రజిత,జమున, మానస,పద్మ,నిర్మల,కవిత,కమల, రజిత, మరియు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# కార్మిక సంఘ నాయకునికి ఉద్యోగుల ఆత్మీయ సన్మానం





**యైటింక్లయిన్ కాలనీ, ఫిబ్రవరి 20, (నినాదం):** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కార్పొరేటర్‌గా గెలుపొందిన ఐ.ఎన్.టి.యు.సీ అర్జీ-2 ఏరియా వైస్ ప్రెసిడెంట్ బదావత్ శంకర్ నాయక్ ను ఓసీపీ-3 ఉద్యోగులు సన్మానించారు. శుక్రవారం ప్రాజెక్టు ఆవరణలోని కృషి భవన్ లో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ ఉదయ్ హరిజన్ ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగులు కార్మిక సంఘాల నాయకు లతో కలిసి పూలమాల లతో సత్కరించి శాలువాలతో సన్మానించారు. మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రాజెక్ట్ సెక్రటరీ కొంగర రవీందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ ఆకుల రాజయ్య, సెంట్రల్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఐరెడ్డి సంపత్ రెడ్డి, సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సోలిగామ మల్లేష్, బ్రాంచ్ సెక్రెటరీ తోకల సమ్మయ్య, బర్ల రవీందర్, వాసాల అశోక్,ఇట్ల శ్రీనివాస్,బానోత్‌జాన్, రాజన్న, శేషు, కంది శ్రీనివాస్,రెడ్డి, రాజుల తిరుపతి, ఆవుల లక్ష్మణ్, బెకెం రవి, ఏఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ శ్యామ్సన్, ప్రాజెక్ట్ సెక్రటరీ మహేందర్ తో శీను,తిరుపతి, రాజు,శంకర్‌తో పాటు కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# సర్ ఫ్రెడరిక్ గ్రాంట్ బాంటింగ్ .... మధుమేహ చికిత్సలో విప్లవాత్మక శాస్త్రవేత్త
## .సర్ ఫ్రెడరిక్ గ్రాంట్ బాంటింగ్ వర్ధంతి



సర్ ఫ్రెడరిక్ గ్రాంట్ బాంటింగ్ ఒక ప్రముఖ కెనడియన్ వైద్యుడు, శాస్త్రవేత్త, మరియు శస్త్రచికిత్స నిపుణుడు. ఆయన ఇన్సులిన్ కనుగొనడంలో కీలక పాత్ర పోషించాడు. ఇది మధుమేహ రోగుల చికిత్సలో విప్లవాత్మక మార్పుని తెచ్చింది. 1923లో, ఈ విశేషమైన పరిశోధనకు గాను నోబెల్ బహుమతి అందుకున్నాడు. ఆయన కృషి అనేక కోట్లు మంది మధుమేహ రోగుల జీవితాలను కాపాడింది.

సర్ ఫ్రెడరిక్ గ్రాంట్ బాంటింగ్ 1891 నవంబర్ 14 న కెనడాలోని అలిస్టన్, ఒంటారియో లో జన్మించాడు. సాధారణ రైతు కుటుంబంలో పెరిగిన బాంటింగ్ తన విద్యకు పెద్దపీట వేసుకున్నాడు.
టొరంటో విశ్వవిద్యాలయంలో వైద్య విద్య అభ్యసించాడు.
1916లో ఎం బి బి ఎస్ పట్టా పొందాడు.
మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో కెనడియన్ ఆర్మీ మెడికల్ కార్ప్స్ లో చేరి వైద్యుడిగా పనిచేశాడు.

1920లో బాంటింగ్ మధుమేహంపై లోతైన పరిశోధన చేయాలని నిర్ణయించు కున్నాడు. టొరంటో విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ జాన్ మెక్ లియోడ్ సహాయంతో ఇన్సులిన్ అభివృద్ధిపై పని చేశాడు.

బాంటింగ్ తన సహచరుడు చార్లెస్ బెస్ట్ తో కలిసి పాంక్రియాస్ గ్రంథి నుండి ఇన్సులిన్ ను వేరు చేయడానికి ప్రయోగాలు ప్రారంభించాడు.
1921లో, కుక్కలపై నిర్వహించిన ప్రయోగాలు విజయవంతమయ్యాయి. 1922లో, లియోనార్డ్ థాంప్సన్ అనే మధుమేహ రోగికి ఇన్సులిన్ ఇంజెక్షన్ ఇచ్చి, అతని ఆరోగ్యాన్ని మెరుగుపరిచారు.

1923లో, బాంటింగ్, జాన్ మెక్ లియోడ్ లు ఫిజియాలజీ లేదా మెడిసిన్ లో నోబెల్ బహుమతి అందుకున్నారు.
అయితే, బాంటింగ్ తన సహచరుడు చార్లెస్ బెస్ట్ కృషిని గుర్తించక పోవడాన్ని వ్యతిరేకించాడు. అందుకే, తన బహుమతి మొత్తం బెస్ట్ తో పంచుకున్నాడు.
1934లో, "సర్" అనే గౌరవ పదవిని పొందాడు. కెనడా దేశం అతన్ని జాతీయ గౌరవంగా గుర్తించింది.
ఇన్సులిన్ కనిపెట్టక ముందు, మధుమేహం ఉన్న రోగులకు ఎటువంటి ప్రభావవంతమైన చికిత్స లేదు. ఈ శాస్త్రసాంకేతిక విజయంతో అనేక కోట్ల మంది రోగులు ప్రాణాలను దక్కించుకున్నారు. నేడు, ఇన్సులిన్ ప్రపంచవ్యాప్తంగా మధుమేహ చికిత్సకు ప్రధాన ఔషధంగా మారింది.

బాంటింగ్ టొరంటో విశ్వవిద్యాలయంలో వైద్య పరిశోధనను కొనసాగించాడు.
రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో, అతను కెనడియన్ ప్రభుత్వానికి వైద్య పరిశోధనలో సహాయం చేశాడు.
1941 ఫిబ్రవరి 21 న, న్యూఫౌండ్‌ల్యాండ్ సమీపంలో ఓ విమాన ప్రమాదంలో మరణించాడు.

బాంటింగ్ ఇన్సులిన్ ఆవిష్కరణ మధుమేహం చికిత్సలో విప్లవాత్మక మార్పులు చేసింది. ఆయన కృషి లక్షలాది మంది జీవనాన్ని మార్చింది.
నవంబర్ 14, బాంటింగ్ పుట్టిన రోజును ప్రపంచ మధుమేహ దినోత్సవంగా జరుపుకుంటారు.
టొరంటోలోని బాంటింగ్ ఇనిస్టిట్యూట్ వైద్య పరిశోధనలకు ప్రాముఖ్యత నిస్తుంది.

సర్ ఫ్రెడరిక్ గ్రాంట్ బాంటింగ్ మానవాళికి చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయి. ఇన్సులిన్ కనిపెట్టడం ద్వారా ఆయన మధుమేహం రోగుల జీవితాల్లో వెలుగును నింపాడు. ఈ విశేషమైన కృషికి గాను ఆయన పేరు వైద్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయింది

**-రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

## ఐటీసీ బంధన్ ఆధ్వర్యంలో
## మహిళలకు స్వయం ఉపాధి కిట్ల పంపిణీ




**అశ్వాపురం, ఫిబ్రవరి 20 (నినాదం):** మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో శుక్రవారం ఐ టి సి బంధన్ కార్యక్రమం ఆధ్వర్యంలో మహిళా ఆధారిత కుటుంబాలకు స్వయం ఉపాధి కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఫ్యాన్సీ దుకాణాలు, కిరాణా షాపులు, హోటల్ కు అవసరమైన పాత్రలు, కూరగాయల బండ్లు, పండ్ల వ్యాపారం కోసం సామగ్రి, కుట్టు యంత్రాలు తదితర ఉపాధి సాధనాలను అందజేశారు. మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలనే ఉద్దేశంతో ఈ కిట్లు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొండికుంట సర్పంచ్ మద్రి సంధ్య, ఐటీసీ ఆఫీసర్ గీత ప్రవళిక, బంధన్ ఏసీ ఉత్తమ్ మర్జిట్, మేనేజర్ వెంకటేశ్వర్లు, నాగేంద్రబాబు, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఎస్.కే. సుభాని, దేవరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సీతమ్మసాగర్ ప్రాజెక్టులో
# ఇనుము చోరీ యత్నం భగ్నం..
సిబ్బంది అప్రమత్తతతో నిందితుడు పట్టివేత కేసు నమోదు



**అశ్వాపురం, ఫిబ్రవరి 20 (నినాదం):** అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి గ్రామంలోని సీతమ్మసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఎల్ అండ్ టి స్టాక్ యార్డ్‌లో ఇనుము సామాగ్రి దొంగతనానికి యత్నించిన వ్యక్తిని సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఘటన చోటుచేసుకుంది. అమ్మవారిపల్లి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి సుమారు రూ.80,000 విలువ చేసే ఇనుము సామాగ్రిని ట్రాక్టర్‌లో తరలించే ప్రయత్నం చేస్తున్న సమయంలో సిబ్బంది గమనించి పట్టుకున్నారు. అనంతరం ట్రాక్టర్‌తో పాటు అతన్ని పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. సెక్యూరిటీ జనరల్ మేనేజర్ చక్రవర్తి ఫిర్యాదు మేరకు సీఐ అశోక్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## స్థానిక ఎంపీటీసీ జడ్పీటీసీ ఎలక్షన్‌లో
# బీసీలకు న్యాయం జరగాలి
– బిసి సంక్షేమ సంఘం మండల ఇంచార్జీ జక్కం రాజేందర్



**మల్హర్, ఫిబ్రవరి 20 (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ రానున్న ఎంపీటీసీ జెడ్పిటిసి ఎన్నికల్లో అధిక జనాభా కలిగిన బిసి వర్గాలకు అధిక స్థానాలను కేటాయించాలని మండల బిసి సంఘం ఇంచార్జి జక్కం రాజేందర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తాడిచెర్ల లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండలంలో ఉన్న ఎంపీటీసీ స్థానాల్లో అధిక సంఖ్యలో బిసిలకు కేటాయించి జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలను బిసిలకు రిజర్వేషన్ చేయాలని కోరారు. మేం ఎంతో మాకంతా అని స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన బిసిలకు సామాజిక న్యాయం చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

## గురుకుల డిగ్రీ కళాశాల
## ప్రవేశాల పోస్టర్ ఆవిష్కరణ



**అశ్వాపురం, ఫిబ్రవరి 20 (నినాదం):** మండల పరిధిలోని మిట్టగూడెం,లో తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల పోస్టర్‌ను ట్రైనీ ఐఏఎస్ సౌరభ్ శర్మ అశ్వాపురం తహాశీల్దార్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత ఉన్నత విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల కాకతీయ విశ్వవిద్యాలయంకు అనుబంధంగా కొనసాగుతూ, ఉచిత విద్య, భోజనం, వసతి, డిజిటల్ తరగతులు వంటి సౌకర్యాలు కల్పిస్తోంది. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు మరిన్ని వివరాల కోసం సంప్రదించవలసిన నెంబర్:7901097698.

# పేదల కల సాకారం
## ఇందిరమ్మ ఇంటిలో నివాసం ప్రారంభం



**మల్లాపూర్, ఫిబ్రవరి 20 (నినాదం) :** మల్లాపూర్ మండలం కొత్త రామరాజు పల్లి గ్రామంలో ప్రభుత్వం నిర్మించిన ఇందిరమ్మ ఇంటిలో లబ్ధిదారులు గుండారపు దేవమ్మ పెద్దలు కుటుంబం శుభ ముహూర్తంలో గృహప్రవేశం శుక్రవారం చేశారు. వేద మంత్రాల మధ్య పూజలు చేసి కుటుంబ సభ్యులు కొత్త ఇంటిలోకి ప్రవేశించారు. ముఖ్య అతిథిగా జువ్వాడి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జువాడి కృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని ప్రతి లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇల్లు అందజేస్తామని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా సొంతింటి కోసం ఎదురుచూసిన తమ కల నెరవేరిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. కొత్త ఇంటిలో సుఖశాంతులతో జీవించాలని అందరూ ఆశీర్వదించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు జువ్వాడి కృష్ణారావు కు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు ఎలాల జలపతి రెడ్డి, కొత్త దాంరాజ్ పల్లి సర్పంచ్ ఎగ్యారపు లింబాద్రి, కాంగ్రెస్ నాయకులు బద్దం నర్స రెడ్డి, నిగ రవి, గజ్జి గంగా రెడ్డి, గ్రామ ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

# కార్మికుల వేతన వెతలు

పారిశుద్ధ్య కార్మికుల
వెట్టి చాకిరి...
వేతనం పెరగలేదు
ఉన్నది రావటం లేదు..
రోగాల బారిన పడుతున్న వైనం
గత 3 నెలలుగా
జీతాలు అందని దుస్థితి...
కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా
343 మల్టీ పర్పస్ వర్కర్స్..







**కోదాడ,నినాదం;** స్వచ్ భారత్ పేరిట వేల కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తున్న పాలకులు నిత్యం గ్రామపంచాయతీలలో పారిశుద్ధ కార్యక్రమాలు చేపట్టే మల్టీపర్పస్ వర్కర్లకు కనీస వేతనాలు అందించడం లేదు... ప్రస్తుతం వారికి జీతాలు పెంచడం లేదు గత కొన్ని 3 నెలలుగా ఉన్న జీతాన్ని చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం పరిసరాలను పరిశుభ్రంగా చేస్తూ అందరికీ ఆరోగ్యంగా ఉండేలా కృషి చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు మాత్రం అనారోగ్యానికి గురవుతున్నారు. అయినా వారి గురించి పట్టించుకునే వారు కనిపించడం లేదు. వేతన సవరణలో భాగంగా ప్రభుత్వం ప్రస్తుతం వీరి నెల జీతం 9500 రూ. అందిస్తుంది. కానీ ప్రభుత్వం 50% వేతనాన్ని పారిశుద్ధ్య కార్మికులకు నేటికీ పెంచలేదు. కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా కోదాడ మండలం70, అనంతగిరి మండలం 66, మునగాల60, చిలుకూరు 48, నడిగూడెం 46, మోతే 53 , మొత్తం 343 మంది మల్టీ పర్పస్ వర్కర్లు విధులు నిర్వహిస్తున్నారు వారందరికీ వేత సవరణలో భాగంగా 9500 రూపాయలను ప్రభుత్వం చెల్లిస్తుంది. ఇవి కూడా రెండు మూడు నెలలకు ఒకసారి ఇస్తూ ఉండటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 30% పెంపును పారిశుద్ధ్య కార్మికులకు వర్తింపచేయలేదు ...

**దుర్వాసన వస్తున్న..**

నిత్యం మురుగు కాలవలు దుర్వాసన వస్తున్న భరిస్తూ వాటిని శుభ్రం చేస్తున్న క్రమంలో అనారోగ్యానికి గురవుతున్నారు. పారిశుద్ధ్య కార్మికులను ప్రభుత్వం గ్రామపంచాయతీ పాలకవర్గం పట్టించుకోకపోవడంతో అప్పులు చేసి ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవలసిన దుస్థితి నెలకొంది .తమ ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం గ్రామపంచాయతీ పాలకవర్గం తగు చర్యలు తీసుకోవాలని గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు వేడుకుంటున్నారు. ప్రతి నెల వేతనాలు సక్రమంగా అందించడంతో పాటు 30% వేతనాలు పెంపు వర్తింపజేయాలని పిఎఫ్, ఈఎస్ఐ, బీమా సౌకర్యాలను కల్పిస్తూ ఆరోగ్య భద్రత, ఆర్థిక భద్రత కల్పించాలని మల్టీపర్పస్ వర్కర్స్ కోరుతున్నారు.

**ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం ...**
**కార్మికుడు బెక్కం చంద్రరావు ఆవేదన**

ప్రతి నెల వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం .కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు ప్రత్యేకంగా నిధులు రాకపోవడంతో వేతనాలు చెల్లించడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారని, గత మూడు నెలలుగా కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ప్రతినెల సక్రమంగా జీతాలు తమ అకౌంట్లో పడేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

**జీతాలు పెంచాలి...**
**సిఐటియు జిల్లా కోశాధికారి గుండు సురేష్..**

గ్రామపంచాయతీ కార్మికులలో 90 శాతం మంది బడుగు బలహీన వర్గాల వారే... ఎనిమిది వేల జీతం ఇచ్చి ఎన్నో పనులు చేయిస్తున్నారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు 22,750 జీతం ఇస్తుండ్రు... జిపి కార్మికులకు సైతం కనీసం 15, 600 అయినా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం...

## పౌష్టికాహారం అందించడమే
# ప్రజా ప్రభుత్వ లక్ష్యం

సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షుడు రమేష్ నాయక్



**కల్వకుర్తి, ఫిబ్రవరి 20 (నినాదం) :** చిన్నారులకు పౌష్టికాహారం అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రమేష్ నాయక్ అన్నారు.

శుక్రవారం ఉరుకొండ మండలంలోని గుడ్లగుంటపల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో చిన్నారులతో పాటు గర్భిణీలు, బాలింతలకు పౌష్టిక ఆహారం అందించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రమేష్ నాయక్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం వచ్చిన అనతి కాలంలోనే ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని అన్నారు.అందులో భాగంగానే గ్రామాల్లో ఉన్న గర్భిణీలు, బాలింతలతో పాటు చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తుందని ఈ అవకాశాలను అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ రజని, ఉపసర్పంచ్ కొండలు తదితరులు ఉన్నారు.

# రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో సత్తా చాటిన విద్యార్థిని

అభినందించిన బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి



**కల్వకుర్తి, ఫిబ్రవరి 20 (నినాదం) :** హైదరాబాద్ లోని దోమలగూడ ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో ఈనెల 17న సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీల్లో నాగర్ కర్నూల్ జిల్లా ఉర్కొండ మండలం బొమ్మరాశిపల్లి గ్రామానికి చెందిన తులసీధర్ ఫ్రాగ్ జంప్ అండర్ 14 విభాగంలో పాల్గొని మొదటి స్థానంలో గెలుపొందారు. శుక్రవారం బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి విద్యార్థి తులసిధర్ ను శాలువాతో సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు తమ శారీరక పరిమితులను అధిగమిస్తూ ధైర్యంగా పోటీల్లో పాల్గొని విజయాలు సాధించడం గర్వకారణం అన్నారు.ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని, ఇటువంటి రాష్ట్రస్థాయి పోటీలు వారికి మరింత ప్రోత్సాహాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించేందుకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కూడా మెరుగైన చాటాలని సూచించారు. ఈ కార్యక్రమశీలో ఉప సర్పంచ్ తిరుపతి,విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సహకారంతో గౌడ సమస్యల పరిష్కారానికి కృషి

మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత....
గౌడ మహిళా కౌన్సిలర్లకు గౌడ సంఘం ఆధ్వర్యంలో సన్మానం



**సుల్తానాబాద్, ఫిబ్రవరి 20(నినాదం):** పెద్దపల్లి ఎమ్మెల్యే చింత కుంట విజయ రమణ రా వు సహకారంతో గౌడ సంఘ సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తానని మున్సిపల్ వైస్ చైర్పర్సన్ అంతటి పుష్పలత అన్నయ్య గౌడ్ అన్నారు. శుక్ర వారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్ గా గెలు పొందిన మహిళ గౌడ బిడ్డలు వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత ,14 కౌన్సిలర్ వేగోళం పద్మ ల కు ఘనంగా శాలువాతో సత్కరించి బొకే అంద జేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్ పర్సన్ మాట్లా డుతూ, రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద గౌడ క మ్యూనిటీ హాల్ ఎమ్మెల్యే సహకారంతో త్వరలో నిర్మా ణం చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ శ్రేణులు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత, పొన్నం తిరుపతి గౌడ్, అంతటి లచ్చయ్య గౌడ్, కె క్కెర్ల శ్రీనివాస్ గౌడ్, కొయ్యడ రమేష్ గౌడ్, కొయ్యడ శ్రీనివాస్ గౌడ్, తో పాటు గౌడ సంఘ నాయకులు తదితరు లు పాల్గొన్నారు.

# తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలి

ఎంపిడిఓ క్రాంతి కుమార్



**మల్హార్, ఫిబ్రవరి 20 (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హార్ మండలం లో రానున్న వేసవి కాలంలో త్రాగు నీటి ఎద్దడి రాకుండా స్వచ్ఛమైన త్రాగు నీటి సరఫరా కోసం చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ క్రాంతి కుమార్, సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పెద్దతూండ్ల, కిషన్రావుపల్లి గ్రామాల్లో మిషన్ భగీరథ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఎంపిడిఓ పరిశీలించారు. భగీరథ పైపులైన్ లీకేజిలు మరమ్మతులు చేసి శుద్ధమైన త్రాగునీరు ను నీటి ఎద్దడి రాకుండా అందించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండారి నర్సింగం, ఎంపీఓ విక్రమ్, మిషన్ భగీరథ ఏఈ అలేఖ్య, గ్రిడ్ ఏఈ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి పెంచాల సతీష్, గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా పాలనకు పట్టం కట్టిన పట్నం ప్రజలు

రేవంత్ రెడ్డి నాయకత్వంలో
పట్టణాలు అభివృద్ధి చేసుకుందాం
రాష్ట్ర ఏఐపిసి అధ్యక్షుడు జిల్లెల ఆదిత్య రెడ్డి







**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 20 (నినాదం) :** ప్రజా పాలనకు పట్నం ప్రజలు పట్టం కట్టారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పట్టణాలను అభివృద్ధి చేసుకుందామని రాష్ట్ర ఎఐపిసి అధ్యక్షుడు డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి అన్నారు. వనపర్తి మున్సిపల్ ఎన్నికల్లో 33 వార్డులకు గాను 22 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు గెలుపొంది మున్సిపాలిటీ పై కాంగ్రెస్ జెండా ఎగరవేశారని చెప్పారు. శుక్రవారం గెలుపొందిన కౌన్సిలర్లను ఆయన సన్మానించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారనిల్ల అన్నారు. రాష్ట్రంలో 80 శాతానికి పైగా కాంగ్రెస్ పార్టీ మునిసిపల్ ఎన్నికల్లో సత్తా చాటిందని అన్నారు. మునిసిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్, బీజేపీలకు ప్రజలు చెంపపెట్టు లాగా తగిన బుద్ధి చెప్పారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల వరకు ఫామ్ హౌస్ కే బీఆర్ఎస్ పార్టీని పరిమితం చేస్తామని, కెసిఆర్ ను నమ్మి అధికారమిస్తే లక్షల కోట్లు దోచుకొని రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రజలు నమ్మి 10 సంవత్సరాలు బీఆర్ఎస్ కు అధికారం ఇస్తే ప్రజలను కెసిఆర్ కుటుంబం మోసం చేసిందని చెప్పారు. బీఆర్ఎస్ రాజకీయ ఉనికి కాపాడుకునేందుకు చేసిన డ్రామాలు బెడిసి కొట్టాయని అన్నారు. మరో 10 సంవత్సరాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కేడర్ అంతా సమిష్టిగా కృషి చేసి అభ్యర్థుల గెలుపుకు సహకరించడం ద్వారా వనపర్తి మునిసిపల్ పీఠాన్ని దక్కించుకోవడం ద్వారా ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ తన పట్టును మరోసారి నిరూపించుకుందని అన్నారు. ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ వనపర్తి మున్సిపల్ చైర్మన్ మిడి దొడ్డి మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కౌన్సిలర్స్ అరుణ జ్యోతి శ్రీనివాస్ గౌడ్, కదిరే నాగమ్మ రాములు, కోట్ల శిరీష రవి, జంగిడి రవి సరిత, ధనలక్ష్మి, శారదా బ్రహ్మచారి, బండారు విజయలక్ష్మిలను ఆదిత్య రెడ్డి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, నాయకులు ఐ.సత్య రెడ్డి, జిల్లా ఏఐపిసి అధ్యక్షులు నాగార్జున, జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సమద్ మియా, పట్టణ ప్రధాన కార్యదర్శి బాబా, జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దివాకర్ యాదవ్, పెద్దమందడి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటన్న యాదవ్, జిల్లా ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు రోహిత్, గోపాల్ పేట మండల కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ జిల్లెల ప్రవీణ్ రెడ్డి, అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం వినోద్, మండల ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షుడు ఎత్తం చరణ్ రాజ్, సీనియర్ నాయకులు కోళ్ల వెంకటేష్, కరుణాకర్ రెడ్డి, ఎంట్ల రవి, వాకిటి బాల్ రాజు, యుగంధర్, నాగరాజు, లక్ష్మీనారాయణ, సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు తదితరులు పాల్గొన్నారు

# యుబిఐ ఏటీఎం సేవలు ఇక నిరంతరం

బ్యాంకు మేనేజర్ శ్యామ్ కుమార్





**ధర్మారం ఫిబ్రవరి 20 (నినాదం) :** మండలంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నర్సింగాపూర్ శాఖ బ్రాంచ్ లో ఏటీఎం సేవలు వినియోగదారులకు నిరంతరం అందుబాటులో ఉంటాయని బ్యాంకు మేనేజర్ శ్యామ్ కుమార్ తెలిపారు.ఖాతాదారులు 24 గంటల పాటు ఎటువంటి అంతరాయం లేకుండా నగదు ఉపసంహరణ,బ్యాలెన్స్ చెక్, మినీ స్టేట్మెంట్ వంటి సేవలను పొందవచ్చని ఆయన వివరించారు.ప్రస్తుతం ఏటీఎంలో తగినంత నగదు నిల్వ ఉంచడం జరుగుతోందని,సాంకేతిక సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేక సిబ్బంది సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.పండుగలు, సెలవుదినాలు వంటి సందర్భాల్లో కూడా ఏటీఎం సేవలు నిరంతరంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఖాతాదారులు ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొంటే వెంటనే శాఖను సంప్రదించాలని మేనేజర్ సూచించారు. వినియోగదారుల సౌకర్యమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.ఖ

# కష్టపడి చదివితేనే భవిష్యత్‌లో మార్పు సాధ్యం

ఎంపీడీఓ నిశాంత్

**మహాముత్తారం, ఫిబ్రవరి 20(నినాదం):** ప్రతి విద్యార్థి కష్టపడి చదివితేనే భవిష్యత్తో మార్పు సాధ్యమవుతుందని ఎంపీడీఓ నిశాంత్ అన్నారు. మహాముత్తారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతి సమయంలో ఆయన పర్యవేక్షించి పరీక్షలపై ఉన్న అపోహాలను తొలగించాలని, కొన్ని మెలకువలను విద్యార్థులను ఉద్దేశించి తెలిపారు. శుక్రవారం రాసిన ప్రీ ఫైనల్ గణిత పరీక్షకు సంబంధించి క్వశ్చన్ పేపర్లో ఉన్న ప్రశ్నలను ఏ విధంగా జవాబులు రాశారని అడిగి తెలుసుకుని విద్యార్థులకున్న సందేహ ప్రశ్నలకు జవాబులను బోర్డుపై చేపించారు, పరీక్షల సమయం ఆసన్నమైందని కష్టపడి చదువుకోవాలని తద్వారా భవిష్యత్తును మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానోపాధ్యాయులు ఏడు దొడ్ల సురేందర్ తో పాటు ఉపాధ్యాయులు లావుడియా ప్రకాష్ హాట్కర్ దేవ్ సింగ్ జటోత్ రామ్ సింగ్, భూక్య మంజుల రఘుపతి రెడ్డి జయ మధుకర్ రావు పాల్గొన్నారు.



# అనధికార వైద్య సేవలపై కఠిన చర్యలు

డీఎంహెచ్ఓ డా. తుకారం రాథోడ్ హెచ్చరిక

ప్రైవేట్ నర్సింగ్ హోంలపై
సుడిగాలి తనిఖీలు
అర్హతలేని క్లినిక్‌కు నోటీసు
ఆశా కార్యకర్త సేవలకు
అభినందనలు







**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఫిబ్రవరి20(నినాదం) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ బూర్గంపాడు, భద్రాచలం పట్టణాల్లోని ప్రైవేట్ నర్సింగ్ హోంలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల నిర్వహణలో లోపాలు ఉన్నచో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ చట్టం ప్రకారం కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆసుపత్రుల్లో అర్హత కలిగిన పరామెడికల్ సిబ్బంది, నర్సింగ్ అధికారులు, నమోదు పొందిన వైద్యులు తప్పనిసరిగా విధులు నిర్వహించాలన్నారు. పేద రోగులకు మానవతా దృక్పథంతో నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నది ప్రతి వైద్య సంస్థ బాధ్యత అని పేర్కొన్నారు. అలాగే ప్రతి ఆసుపత్రి ముందు ప్రజలకు స్పష్టంగా కనిపించేలా చికిత్సల ధరల పట్టిక, విధుల్లో ఉన్న వైద్యుల పేర్ల జాబితా, అందించే సేవల వివరాలను ప్రదర్శించాలని ఆదేశించారు. అదేవిధంగా పాల్వంచ నాగారం కాలనీలోని షేక్ రంజాన్ అలీ నిర్వహిస్తున్న పీఎంపీ ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ చేయగా పలు అక్రమాలు వెలుగుచూశాయి. అర్హతలేని వ్యక్తి క్లినిక్ నిర్వహించడం, ఇంజెక్షన్లు, వైద్య ప్రకటన బ్రోచర్లు కలిగి ఉండటం, రోగుల కోసం చెక్క పడకలు ఏర్పాటు చేయడం, బీపీ యంత్రం, స్టెతస్కోప్ వంటి వైద్య పరికరాలు వినియోగించడం వంటి అంశాలు గుర్తించబడ్డాయి. ఈ నేపథ్యంలో సంబంధిత వ్యక్తికి నోటీసు జారీ చేసి ఆరు రోజుల లోపు వివరణ సమర్పించాలని ఆదేశించారు. తదుపరి డీఎంహెచ్ఓ ఎంపీ బంజారా ఉప కేంద్రాన్ని సందర్శించి రికార్డులు, ఐఈసీ మెటీరియల్స్, ఆశా కార్యకర్తల "ఫ్రైడే డ్రై డే" కార్యక్రమ సర్వే ఫార్ములను పరిశీలించారు. ఆశా కార్యకర్త శ్రీమతి రాధ గారి సేవలను ప్రత్యేకంగా అభినందిస్తూ, అన్ని ఆశాలు నిర్దేశిత సర్వే ఫార్మాట్‌ను కచ్చితంగా నిర్వహించి ప్రతి నెల నివేదికలు సమర్పించాలని, పురోగతిని నిరంతరం సమీక్షించాలని సిబ్బందికి సూచించారు. ఇటీవల పదవీ విరమణ చేసిన ఏఎన్ఎం ధనలక్ష్మి గారి సేవలను స్మరించుకుంటూ జరిగిన కార్యక్రమంలో కూడా డీఎంహెచ్ఓ పాల్గొని ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఉప జిల్లా వైద్య అధికారి డా. శ్రీధర్, భద్రాచలం (గిరిజన) ఉప జిల్లా వైద్య అధికారి డా. సైదులు, నర్సాపురం వైద్య అధికారులు, డిపియంఓ మోహన్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

శనివారం, తెలంగాణ
21 ఫిబ్రవరి 2026
# నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

## తెలంగాణ రైతాంగానికి రైతు భరోసా ఎప్పుడో!..

రైతు భరోసా పడక... దిగులు చెందుతున్న రైతన్నలు



**డోర్నకల్ /మరిపెడ ఫిబ్రవరి 20(నినాదం):** తెలంగాణ రాష్ట్రంలోని రైతన్నలు రైతు భరోసా అందక.. దిగులు చెందుతున్నారు. సంక్రాంతి పండుగ నాడే రైతు భరోసా అందజేస్తానని స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన తర్వాత కూడా రైతు భరోసా తెలంగాణ రైతంగానికి అందలేదు.. అందకపోగా మరో మాటగా తెలంగాణ రాష్ట్రంలో మునిసిపల్ ఎన్నికలు అయిపోంగానే రైతు భరోసా నిధులు రైతులకు అందజేస్తానని రైతులకు ఉచిత మాటలు చెప్పి, నేడు రైతుల అకౌంట్లో రైతు భరోసా జమ చేయడం జరుగుతుందని,నమ్మ బలికిస్తున్నారు.నాటు వేసి 45 రోజుల సమయం కావస్తున్న రైతు భరోసా నిధులు జమ కాలేదు.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో రెండు పంటలకే కాకుండా మూడో పంటకు కూడా రైతు భరోసా ఇవ్వాలని ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కనీసం రెండు పంటలకు కూడా రైతు భరోసా సమయానికి ఇవ్వకపోగా,గత సంవత్సరం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక పంటకు రైతు బంధు,భరోసా వేయకుండా రైతులకు వేగాకొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.నేడు కూడా రేపు మాపు అంటూ కాలం వెల్లదిస్తున్నారు. తప్ప రైతులకు రైతు భరోసా అందడం లేదని రైతులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రైతు భరోసా అందిస్తారో లేదో అనే అయోమయంలో తెలంగాణ రైతన్నలు ఉన్నారు.రైతు భరోసా అందేదెప్పుడు, ఎరువులు,నాట్ల కోసం చేసిన అప్పులు తీరేది ఎప్పుడో!

## కమలాపూర్‌లో బస్టాండ్ లేక ప్రయాణికుల ఇబ్బందులు



**కమలాపూర్, ఫిబ్రవరి 19 (నినాదం):** మంత్రులుగా పనిచేసినా నేటికీ కమలాపూర్ మండల కేంద్రంలో బస్టాండ్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరీ శ్రీనివాస్ పేర్కొన్నారు.మండలంలోని కన్నూర్, గూడూరు గ్రామాలకు చెందిన పలువురు సీపీఐ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కమలాపూర్ నియోజక వర్గ కేంద్రంగా ఉన్నప్పుడు ఆనాటి దామోదర్ రెడ్డి రెండుసార్ల మంత్రిగా పనిచే చేశారు. మొన్నటి వరకు కమలాపూర్ సొంత గ్రామమైన ఈటెల రాజేందర్ రెండు పర్యాయాలు మంత్రిగా పనీ చేశారు. అయినా కమలాపూర్ మండల కేంద్రంలో బస్టాండు లేదన్నారు.ప్రయాణికులు రోడ్డుపై వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అసంపూర్తిగా ఉన్న బస్టాండు ప్రయాణికులకు పనికిరాకుండా పోయిందన్నారు. అసంపూర్తిగా ఉన్న బస్టాండ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారిని సీపీఐ పార్టీ పక్షాన కోరామని తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుని ప్రజలకు అనేక రకాల సమస్యలపై పోరాటం చేస్తుందన్నారు. గాజుల పోషాలు కిన్నెర సంతోష్, గాజుల దిలీప్,తో పాటుగా పలువురు చేరారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శినకిర్తి ఓదెలు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జక్కు రాజు గౌడ్, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మల రామ్మూర్తి, సిపిఐ మండల సహాయ కార్యదర్శి గోలే మహేందర్, రైతు సంఘం మండల అధ్యక్షులు ఇసంపల్లి శంకర్, సహాయ కార్యదర్శి కొలుగూరి బాలరాజు,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శక్తి మహిళా సమైక్య భవనానికి శంకుస్థాపన



**కోదాడ, ఫిబ్రవరి 20 (నినాదం):** ఆకు పాముల గ్రామపంచాయతీ పరిధిలో శ్రీ శక్తి మహిళా సమైక్య భవన నిర్మాణానికి శుక్రవారం సర్పంచ్ వసుంధర రమేష్ రాజు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల సాధికారతకు, స్వయం సహాయక సంఘాల సమావేశాలు మరియు వివిధ సామాజిక కార్యక్రమాలకు ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని ఆమె పేర్కొన్నారు.ఉప సర్పంచ్ కే. నాగేశ్వరరావు, గ్రామ పంచాయితీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## యూరియాను పాత పద్ధతిలోనే పంపిణీ చేయాలి

- వ్యవసాయ డైరెక్టర్‌ను కోరిన టీజెఎస్ నాయకులు



**పాలేరు ఫిబ్రవరి 20( నినాదం):** యూరియా పంపిణీని పాత పద్ధతి లోనే కొనసాగించాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి ని టీజెఎస్ నాయకులు కోరారు. శుక్రవారం తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్రావు, జిల్లా నాయకులు మాదాసు శ్రీనివాసరావు, బీ.రాజేందరా నాయక్ లు హైద్రాబాద్ లోని డైరెక్టర్ ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాడారు.ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా పంపిణీ యాప్ వలన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. యాప్ ను తొలిగించి పాత పద్ధతిలో ఆధార్ కార్డు, పహాని ద్వారా యూరియా ను అందించాలని డిమాండ్ చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాప్ విధానంను,ఎత్తివేయకపోతే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. తమ విన్నపం పై సంచాలకులు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

# అభయహస్తంలో జమ చేసిన సొమ్ము సభ్యులకు అందేదెప్పుడు..?

2019 నుండి లబ్ధిదారులకు
పింఛన్లు నిలిపివేత
ఇన్సురెన్స్ లేదు విద్యార్థుల స్కాలర్‌షిప్ రాదు
అభయహస్తం పథకం నిలిచే నాటికి
7వేల మంది సభ్యులు
పైసలు రాకుండానే
వందల మంది సభ్యులు మృతి




**కమలాపూర్, ఫిబ్రవరి 20 (నినాదం):** గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వృద్ధాప్యంలో ఉన్న తల్లులకు అండగా ఉండడానికి అభయహస్తం అనే పథకం ప్రవేశ పెట్టారు. ఈ పథకాన్ని 2022 లో గత టి ఆర్ ఎస్ ప్రభుత్వం రద్దు చేసింది. ఈ పథకంలో ఉన్న సభ్యులకు వారు చెల్లించిన సొమ్ముకు వడ్డీ కలిపి సభ్యుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు.2023 లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టి ఆర్ ఎస్ ఓటమి చెంది అధికారం కోల్పోయింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా అభయహస్తం లో ఉన్న సభ్యులకు వడ్డీతో కలిపి తిరిగి చెల్లిస్తామని చెప్పారు కాని అది నేటి వరకు అమలు పర్చలేదు. గత తెలుగుదేశం ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్ 50 రూ ఇచ్చేది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి పింఛన్ 200రూ చేశారు.స్వయం సహాయక సంఘాల మహిళల కోసం అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి అభయహస్తం పథకం తీసుకొచ్చారు.మహిళా సంఘాలకు చెందిన సభ్యులు అభయహస్తం పథకంలో పింఛను పొందడానికి 18 నుండి 59 సంవత్సరాల వయస్సు లోపు స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులు రోజుకు 1 రూ చొప్పున సంవత్సరానికి 365 రూ చెల్లిస్తే ప్రభుత్వం కూడా అంతే మొత్తాన్ని వారి ఖాతాలో జమచేసేది. సభ్యులు జమచేసిన మొత్తాన్ని బట్టి 60 సంవత్సరాలు దాటిన వృద్ధాప్యం లో ఉన్న మహిళలకు నెలకు 500 రూ చొప్పున పింఛన్ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించేది. సాదారణ వృద్ధులకు 200 పింఛన్ రాగా, అభయహస్తం లో ఉన్న వృద్ధులకు 500 రూ పింఛన్ చెల్లించే వారు.2014 లో తెలంగాణలో టి ఆర్ ఎస్ ప్రభుత్వం ఏర్పడగా వృద్ధులకు రూ1,016 పెంచారు. రెండవ సారి అధికారంలోకి రాగానే పింఛన్లు రూ 2016 పెంచారు. అయితే రెండోసారి అధికారంలోకి రాగానే 2019లో అభయహస్తం పింఛన్ల ను అప్పటి ప్రభుత్వం నిలిపి వేసింది. పింఛన్లు వస్తాయని ఎదురు చూసిన మహిళలకు ఈ పథకం రద్దు చేస్తున్నట్లు అప్పటి ప్రభుత్వం ప్రకటించడంతోనిరాశే మిగిలింది. ఈ పథకంలో సభ్యులుగా కొనసాగిన వారికి సభ్యత్వ సొమ్మును తిరిగి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదేవిధంగా పింఛన్లు పొందిన మహిళలతో పాటుగా అందులో సభ్యులుగా చేరిన మహిళలకు ఆ పథకంలో ఎంత సొమ్ము చెల్లించారో లెక్క కట్టి తిరిగి ఇవ్వాలని నిర్ణయించారు.అయినా అది కార్యరూపం దాల్చలేదు. ఆ పథకంలో చేరిన మహిళలకు ఫించన్లతో పాటుగా సభ్యుల కుటుంబ సభ్యులకు ఇన్సరెన్స్ వర్తించేది. కుటుంబ యజమాని మృతి చెందితే రూ 35 వేల నుండి 75 వేల వరకు బీమా వచ్చేదన్నారు. దాంతో పాటుగా సభ్యుల కుటుంబంలో పిల్లలు 8వ తరగతి నుండి 12వ తరగతి చదివే వారికి ప్రత్యేకమైన ఉపకార వేతనాలు ప్రభుత్వం అందించేది. అప్పటి టి ఆర్ ఎస్ ప్రభుత్వం రద్దు చేసిన పథకం గత రెండున్నర సంవత్సరాల క్రితం ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకంలో ఉన్న సభ్యులకు వారు జమ చేసిన సొమ్ము వారి బ్యాంక్ ఖాతాల్లో వేయడానికి సమాచారం సేకరించారు కాని నేటి వరకు వారి సొమ్ము జమ కాలేదు. అ పథకం లో చేరిన కొందరు మహిళలు ఇప్పటికే మృతి చెందారు. మండలంలో 24 గ్రామాలు ఉండగా ఒక మండల సమైక్య సంఘము, 54 గ్రామ సమైక్య సంఘాలు,1504 మహిళా సంఘాలు ఉండగా వాటిలో 1504 మంది సభ్యులు ఉన్నారు. అదేవిధంగా అభయహస్తం పథకం ప్రభుత్వం నిలిపి వేసే సమయానికి మండలంలో 7 వేల మంది సభ్యులు ఉన్నారు.కొందరు మహిళలు ఇప్పటికే వివిధ కారణాలతో మృతి చెందారు.ఈ పథకంలో ఒక్కో సభ్యురాలు పథకం నిలిపి వేసే వరకు 1500రూ నుండి 3 వేల రూ వరకు చెల్లించినట్లు అంచనా, ఒక వేళ ప్రభుత్వం సబ్యులకు వడ్డీ కలిపి ఇస్తే రూ 3 వేల నుండి 8 వేల రూపాయల వరకు రావచ్చు.ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అయినా జమ చేసిన సొమ్మును తిరిగి ఇవ్వాలని మహిళలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## నాణ్యత ప్రమాణాలతో వంద పడకల ఆసుపత్రి త్వరితగతిన పూర్తి చేయాలి

- సిపిఐ మరిపెడ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ



**డోర్నకల్/మరిపెడ ఫిబ్రవరి 20(నినాదం):** మరిపెడ మండల మరిపెడ మండల కేంద్రంలోని నిర్మించి 100 పడకల ఆసుపత్రిని కాంట్రాక్టర్ ప్రభుత్వ నాణ్యత పరిమాణాలతో త్వరితగతిని పూర్తిచేసి మరిపెడ మండల ప్రజలకు పరిసర ప్రాంతాల ప్రజలకి అందుబాటులోకి తీసుకురావాలి.వంద పడకల ఆసుపత్రి ప్రారంభమై పనులు జరుగుతున్న పనుల్లో నాణ్యత పరిమాణం సదరు కాంట్రాక్టర్ పాటిస్తాలేదని భవిష్యత్ తరాలకి ఒక తల మాలికగా ఈ వంద పడకల ఆసుపత్రి చరిత్రలో నిలిచిపోయే విధంగా నాణ్యత పరిణామాలు పాటించాలని నాణ్యత,పరిణామాల విషయంలో సదరు కాంట్రాక్టర్ ఆలస్యం నిర్లక్ష్యం వహిస్తే సిపిఐ పార్టీ పక్షాన ప్రజాపోరాటాలు చేస్తామని అదేవిధంగా అన్ని రంగులతో జిల్లా స్థాయికి మించే విధంగా ఈ వంద పడకల ఆసుపత్రి నిర్మాణం తరువాత అందుబాటులోకి రావాలని ప్రభుత్వాన్ని సదర్ కాంట్రాక్టర్ ని సిపిఐ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం అదేవిధంగా వంద పడక ఆసుపత్రికి వెళ్లే రహదారి మెయిన్ ఎంట్రెన్స్ 10 పది నుండి 12 మీటర్ల పొడవు మాత్రమే ఉన్నది వల్ల అత్యవసర వాలా వాహనాలు ఫోర్ వీలర్స్ రాకపోకలకు రోగులకు నిర్మాణం పూర్తయిన తర్వాత ఇబ్బంది తలెత్తే అవకాశం ఉంది కావున స్థానిక ఎమ్మెల్యే గారు ప్రవేశద్వారం ముందు ఉన్న పీహెచ్సీ యొక్క మెయిన్ ఎంట్రెన్స్ రహదారి హాస్పటల్ ఆధీనంలో ఉన్న భూమి కొంత కబ్జాకి గురియే ఆక్రమణకు గురై అక్రమ కట్టడాలు నిర్మించడం జరిగింది.వీటిని తొలగించి వంద పడకల ఆసుపత్రి ప్రవేశ ద్వారాన్ని మండల కేంద్రానికి ప్రధాన బిందువుగా అభివృద్ధి కనిపించే విధంగా తీర్చిదిద్ది ఆ రహదారి పొడవు పెంచే విధంగా కృషి చేయాలని అక్రమ కట్టడాలను తొలగించాలని సిపిఐ పక్షాన డిమాండ్ చేస్తున్నాము ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి మల్లెపాక యాకన్న నాయకులు లింగన్న అంజి తదితరులు పాల్గొన్నారు.

## అస్థిత్వం కోల్పోతున్న చెన్నాపురం చెరువు





- ప్లాస్టిక్ వ్యర్థాలు, భవన నిర్మాణ శిథిలాలు, రసాయన వ్యర్థాలతో కలుషితం
- ఒకప్పుడు జవహర్‌నగర్ ప్రజల ఆదెరువు
- చెన్నాపురం ప్రజల బతుకు దెరువు
- పంట పొలాలకు ఈ చెరువు ఆదరువు
- దయనీయంగా చెన్నాపురం చెరువు


**జవహర్‌నగర్, ఫిబ్రవరి 20 (నినాదం):** ఒకప్పుడు ఊరికి ప్రాణాధారంగా...సాగునీటికి నిలయంగా ఉన్న చెన్నాపురం, ఇతర చెరువులు నేడు 'డస్ట్ బిన్'లుగా మారుతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు, భవన నిర్మాణ శిథిలాలు, రసాయన వ్యర్థాలతో చెరువులు నిండిపోయి, అస్థిత్వాన్ని కోల్పోతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, ప్రజల్లో అవగాహన లోపం వెరసి జలాశయాలు మురుగు కుంటలుగా మారుతున్న వైనం ఆందోళన కలిగిస్తోంది. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కీసర సర్కిల్ పరిధిలోని చెన్నాపురం చెరువు కాలుష్యం కాసా రంగా మారి వ్యర్థాలతో కొట్టుమిట్టాడుతోంది. ప్లాస్టిక్ కాలుష్యం చెరువుల్లోకి వచ్చి చేరుతున్న టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వల్ల నీరు కలుషితం కావడమే కాకుండా, భూగర్భ జలాల రీఛార్జ్ కావడం ఆగిపోతోంది.ఆక్రమణలకు దారి: ముందుగా చెత్త వేసి చెరువును పూడ్చివేయడం, ఆ తర్వాత దాన్ని ఆక్రమించి అక్రమ కట్టడాలు చేపట్టడం ఒక మాఫియాగా మారింది.జీవవైవిధ్యం దెబ్బతినడం: నీటిలోని ఆక్సిజన్ స్థాయి తగ్గి చేపలు, ఇతర జలచరాలు మృత్యువాత పడుతున్నాయి. వలస పక్షుల రాక కూడా గణనీయంగా తగ్గింది. ప్రముఖ కవి గోరేటి వెంకన్న అన్నట్టు చెరువోయి... మా ఊరి చెరువు... ఇది జవహర్ నగర్ ప్రజల.... ఆదేరువు! చెన్నాపురం రైతుల బతుకుదెరువు. ఇక పంట పొలాలకు ఆదరణకు కరువు, జవహర్ నగర్ లో మత్స్య సంపదకు నిలవైన ఈ చెరువు నేడు కాలుష్యం కసారంగా, విషపు మడుగుగావ్యాధు ప్రబలి చెత్త కుళ్ళిపోవడం వల్ల దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతున్నాయి.నిబంధనలు ఏం చెబుతున్నాయి?పర్యావరణ పరిరక్షణ చట్టాల ప్రకారం చెరువుల్లో వ్యర్థాలను వేయడం శిక్షార్హమైన నేరం. మున్సిపల్ చట్టాల ప్రకారం భారీ జరిమానాలతో పాటు జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉంది. కానీ, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో నిబంధనలు కాగితాలకేపరిమితమవుతున్నాయి.

**పరిష్కార మార్గాలు..**

చెరువుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు సి.సి. కెమెరాల ద్వారా నిఘా ఉంచాలి.ప్రజల భాగస్వామ్యం: స్థానిక ప్రజలకు పర్యావరణంపై అవగాహన కల్పించి, చెత్తను రీసైక్లింగ్ కేంద్రాలకు పంపేలా ప్రోత్సహించాలి.కఠిన చర్యలు వ్యర్థాలను పారబోసే వ్యక్తులు, సంస్థలపై భారీ జరిమానాలు విధించాలి.పూడిక తీత కలుషితమైన చెరువులను ప్రక్షాళన చేసి, గుర్రపుడెక్క వంటి కలుపు మొక్కలను తొలగించాలి. చెరువులు కేవలం నీటి వనరులు మాత్రమే కాదు, అవి ఒక నాగరికతకు చిహ్నాలు. వాటిని కాపాడుకోవడం మనందరి కనీస బాధ్యత. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు కలిసికట్టుగా అడుగు వేస్తేనే మన జలవనరులను భావి తరాలకు అందించగలం ఇకనైనా మున్సిపల్ అధికారులు సుందరీకరణలో భాగంగా చెన్నాపురం చెరువును గుర్రపుడెక్కలు లేకుండా చెత్త రహితంగా తయారుచేసి జవహర్ నగర్ ప్రజలకు... రైతులకు... స్వచ్ఛమైన నీటిని అందించాలని జవహర్ నగర్ ప్రజలు కోరుకుంటున్నారు.



## ఆకాశంలో నెలవంక దర్శనం.. నేటి నుంచే రంజాన్...



**పాలేరు ఫిబ్రవరి 20( నినాదం):** నేలకొండపల్లి మండల కేంద్రంలో రంజాన్ నెల ప్రారంభ ఉపవాసాలు, ప్రార్థనలు, దానధర్మాలతో నెలరోజుల పాటు నియమ, నిష్ఠలతో గడిపే పవిత్ర రంజాన్ మాసం రానే వచ్చింది. మానవాళి మనుగడకు దిశా నిర్దేశం చేసిన ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్ భూమిపై ఆవిర్భవించిన రోజులనే రంజాన్ మాసంగా జరుపుకోవాలని ఆనవాయితీగా వస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానుంది. సౌదీ అరేబియాలో నెలవంక కనిపించినట్లు మతపెద్దలు తెలిపారు. అయితే రంజాన్ మాసం దాదాపు 31 ఏళ్ల తర్వాత ఫిబ్రవరిలో ప్రారంభం కాబోతోంది. గతంలో 1995 ఫిబ్రవరి 1వ తేదీన రంజాన్ మాసం మొదలైంది. అప్పటి నుంచి ఇప్పుడే మళ్లీ ఫిబ్రవరిలో రంజాన్ మాసం ప్రారంభం కావడం విశేషం. మరోవైపు రంజాన్ నేపథ్యంలో ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో ముస్లిం ఉద్యోగుల పనివేళల్లో వెసులుబాటును ప్రభుత్వాలు కల్పించిన విషయం తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు అత్యంత పవిత్ర పండుగా భావించే రంజాన్ మాసం నేటి నుంచి ప్రారంభం కానుంది. పవిత్ర మక్కా మసీదు నెలకున్న సౌదీ అరేబియాలో నెలవంక దర్శనం ఇవ్వడంతో నేటి నుంచి అధికారికంగా రంజాన్ మాసం ప్రారంభం అవుతుందని ప్రకటించారు. అలాగే సౌదీ సుప్రీం కోర్టు కూడా రంజాన్ ప్రారంభాన్ని ధృవీకరించింది. భారత్ లో సౌదీ ప్రకటనను అనుసరిస్తారు. కాబట్టి ఇక్కడ కూడా రంజాన్ మాసం ప్రారంభం అయినట్టుగా భావించవచ్చు. ఇక రంజాన్ మాసం ప్రారంభం కావడంతో ముస్లిం సోదరులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటున్నారు. మరోవైపు రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సౌకర్యం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉపవాసాలు పాటించే ఉద్యోగుల సౌకర్యార్థం సాయంత్రం 4 గంటలకే విధులు ముగించుకునేలా అనుమతి ఇచ్చింది. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం ఉద్యోగులకు ఈ మేరకు ప్రత్యేకమైన వెసులుబాటు కల్పించింది. తాజా నిర్ణయంతో ఈ నెల 19వ తేదీ నుంచి వచ్చే నెల 20 వరకు ముస్లిం ఉద్యోగులు తమ విధులను సాయంత్రం 4 గంటలకే ముగించుకునే అవకాశం ఉంటుంది. ఇక ప్రభుత్వ నిర్ణయంపై ముస్లిం ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నెలలో పవిత్ర దివ్య కురాన్ ను భూమిపైకి అల్లాహ్ పంపించినట్లుగా ముస్లింల అపార నమ్మకం. దివ్య ఖురాన్లోని 30 అధ్యాయాలను రోజుకో అధ్యయనం చొప్పున అల్లాహ్ ఈ భూమి మీదికి పంపించడంతో రంజాన్ నెలలోనే 30 రోజులను పవిత్ర రోజులుగా భావిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తుంటారు. వాస్తవానికి దివ్య ఖురాన్ లో మానవుడు ఎలా బతకాలి ఎలా బతకరాదనే విషయాలను అల్లాహ్ చాలా స్పష్టంగా పేర్కొన్నారు. ప్రతి ముస్లిం ఐదు పూటల నమాజ్ చేయడంతో పాటు కష్టాల్లో ఉన్న వాళ్లకు సహాయం చేయడం, హజ్ మక్కా యాత్రను పూర్తి చేయడం, ఉపవాస ప్రార్థనలు చేయడం, జకత్ లను చెల్లించడం తదితర నియమాలను పాటిస్తే అల్లాహ్ అనుగ్రహాన్ని పొందుతారని నమ్మకం.

## రైతులకు నోటీసులు ఇవ్వటం సిగ్గుచేటు..!



**పాలేరు ఫిబ్రవరి 20( నినాదం):** రైతులకు సోసైటీల ద్వారా నోటీసులు ఇవ్వటం సిగ్గుచేటు అని బీజెపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ పేర్కొన్నారు. నేలకొండపల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎన్నికల సమయంలో రూ.2 లక్షల రుణాలు మాఫీ చేస్తామని మాట ఇచ్చి ప్రభుత్వం మాట తప్పిందని అన్నారు. రుణాలు చెల్లించాలని ప్రభుత్వం రైతులకు నోటీసులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్చి లోపు చెల్లించకపోతే ఆస్తులు జప్తు చేస్తామని రైతులను బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులకు ఇచ్చిన నోటీసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. సహకార సంఘాల అధికారులు రైతుల ఇళ్ల వద్దకు వచ్చి బలవంతంగా రుణాలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రైతుల జోలికి వస్తే సహించేది'లేదని హెచ్చరించారు. ఈ విలేకర్ల సమావేశంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మల్లేబోయిన గోవిందరావు, కందరబోయిన గోపి, రామచారీ తదితరులు పాల్గొన్నారు.

# నినాదం
## తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

శనివారం 21 ఫిబ్రవరి 2026


## 25న వాహనాల వేలం

**మంచిర్యాల, ఫిబ్రవరి 20(నినాదం):**
ఈ నెల 25న పలు రకాలు కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయనున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ మంచిర్యాల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో వేలం వేయబడుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు స్టేషన్ నందు సంప్రదించాలని తెలిపారు.

## పరీక్షల నిర్వహణలో
## సిఎస్‌డిఓలదే ముఖ్య పాత్ర
### -నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
### -సిసి కెమరా నీడలో పరీక్షలు
### -జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్



**నిజామాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 20 (నినాదం) :**
2025-26 విద్యా సంవత్సరం వార్షిక పరీక్షల నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్ లు,డిపార్ట్ మెంటల్ అధికారులదే ప్రముఖమని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఇంటర్ బోర్డు కఠిన చర్యలు తీసుకుంటుందని జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపుడి రవికుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం నిజామాబాద్ బాలుర( ఖిల్లా) జూనియర్ కళాశాలలో ఉదయం చీఫ్ సూపరింటెండెంట్ లు,డిపార్ట్ మెంటల్ అధికారులతో డీఐఈవో రవికుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 58 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇంటర్ బోర్డు కమిషనర్, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. చీఫ్ సూపరింటెండెంట్ లు, డిపార్ట్ మెంటల్ అధికారులు పరీక్షల నిర్వహణ లో ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇంటర్ బోర్డు కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. సిఎస్, డి.ఓలు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాల్లో వెంటనే సీ. సీ. కెమెరాలు పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రశ్నపత్రాలను సి.సి. కెమరా ల ముందే ఓపెన్ చేయాలని ఆదేశించారు. అందరూ సమయ పాలన చేయాలని, పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు వెంటనే సమకూర్చాలని ఆదేశించారు. సెల్ ఫోన్ లను ఎట్టి పరిస్థితిలో పరీక్ష కేంద్రంలో అనుమతించే ప్రసక్తే లేదని, సి.ఎస్, డిఓలు కూడా పరీక్ష జరుగుతున్న సమయంలో పోలీస్ కస్టడీలోనే ఉంచాలన్నారు. పరీక్షల నిర్వహణకు ముందే ఇన్విజిలేటర్ ల సమావేశం నిర్వహించి తగిన నియమ నిబంధనలు వివరించాలని సి.ఎస్, డిఓలను ఆదేశించారు. ప్రతి రోజు ఫ్లయింగ్, సిట్టింగ్,ఇంటర్ బోర్డు స్క్వాడ్ లతో పాటు జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు, హై పవర్ కమిటీ అన్ని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తారని, విద్యార్థిని, విద్యార్థులను పరీక్షా హాలు లోకి పంపే ముందే క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపించే బాధ్యత సీ.ఎస్, డి. ఓ.లదేనని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూ, విద్య శాఖ, విద్యుత్, ఆర్టీసీ, హెల్త్, పోస్టల్, పోలీస్ అధికారులతో ఇదివరకే సమన్వయ సమావేశం జరిగిందని పరీక్ష కేంద్రాల వారీగా సి.ఎస్, డి.ఓ. లు సంబంధిత స్థానిక అధికారులకు తగిన ఏర్పాట్ల కోసం లెటర్ లు రాయాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు ముందు పరీక్ష జరుగుతున్న సమయంలోపరీక్ష పూర్తయిన తరువాత తీసుకోవలసిన చర్యలను పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు నుస్రత్ జహాన్, రజియుద్దిన్న అస్లాం, రజియా సుల్తానా లు తెలియజేశారు. సమావేశంలో హై పవర్ అధికారి కైసర్ పాషా ,బల్క్ అధికారి చిన్నయ్య, బాలుర (ఖిల్లా) జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఖాలిక్ లు సి.ఎస్, డిఓలకు పరీక్షల నిర్వహణ బాధ్యతలను వివరించారు.

## తెలంగాణను క్రీడల హబ్‌గా తీర్చిదిద్దే దిశగా
## సీఎం కప్ పోటీలు
### -సర్దార్ పటేల్ స్టేడియంలో రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలు ప్రారంభం



**ఖమ్మం ప్రతినిధి,ఫిబ్రవరి 20: (నినాదం):**
తెలంగాణను క్రీడల హబ్‌గా అభివృద్ధి పరచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'సీఎం కప్2025-2026' రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలు శుక్రవారం ఖమ్మంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియం లో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను పోలీస్ కమిషనర్ ప్రారంభించారు.రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన 230 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొ న్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, సీఎం కప్-2026లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచి గుర్తింపు సాధించాలని సూచించారు. క్రీడల ద్వారా క్రీడా స్ఫూర్తి పెంపొందు తుందని, గెలుపు మాత్రమే కాదు పాల్గొనడమే ముఖ్యమని తెలిపారు. ఓటమికి భయపడకుం డా క్రమం తప్పకుండా సాధన చేయాలని యువతకు పిలుపుని చ్చారు.యువత అసామాజిక కార్యకలాపాలకు దూరంగా ఉండి క్రీడల్లో చురుకుగా పాల్గొనాలని, గ్రామీణ క్రీడలను బలోపేతం చేసి గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలనే ప్రభుత్వ లక్ష్యంతో ఈ పోటీలు నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో ఈ పోటీలు ఉత్తమ చాంపియన్లను తయారు చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడా అధికారి సునీల్ కుమార్ రెడ్డి, ఆర్చరీ జిల్లా ప్రెసిడెంట్ సారంగపాణి, కార్యదర్శి పుట్టా శంకరయ్య, ఒలింపిక్ అసోసియేషన్ బాధ్యులు క్రిష్టఫర్ బాబు, డా. వెంకటేశ్వర్లు, ఆఫీస్ మేనేజర్ ఉదయ్ కుమార్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి రామా రావు, ఆదర్శ్ కుమార్, రంజాన్, సైదేశ్, ముజాహిద్, నవీద్ పాషా, డీఎస్‌ఏ కోచెస్, డీఎస్‌ఏ సిబ్బంది, అన్ని జిల్లాల కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.క్రీడాకారులకు మంచి వసతి, భోజన సదుపాయాలు కల్పించినట్లు డీవైఎస్ఓ సునీల్ రెడ్డి తెలిపారు.

## పేదింటి ఆత్మగౌరవ ప్రతీకలు ఇందిరమ్మ ఇళ్లు



**ఆర్మూర్, ఫిబ్రవరి 20 (నినాదం) :**
"పేదవాడి సొంతింటి కలను నిజం చేస్తూ, వారి ఆత్మగౌరవ ప్రతీకగా ఇందిరమ్మ ఇళ్లు నిలుస్తున్నాయి" అని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం రోజున నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.ని యోజకవర్గ వ్యాప్తంగా ముత్యాల సునీల్ కుమార్ శుక్రవారం పలు గ్రామాల్లో పర్యటించి, లబ్దిదారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని బహుకరించి గృహాలను ప్రారంభించారు. ఏర్గట్ల మండలం (తొర్తి): సాట్ల నడ్పి రాజు,వేల్పూర్ మండలం (లక్కోర): ముత్యాల సంధ్యా ప్రభాకర్, కిసాన్ నగర్: షబానా బేగం ఇందిరమ్మ ఇల్లు, నాగపూర్: నవీన్ యాదవ్ గృహప్రవేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని తెలిపారు. నియోజకవర్గంలో అర్హత కలిగి ఉండి, ఇల్లు కట్టుకోవాలనుకునే ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గత పాలకుల వలె కాకుండా, రాజకీయాలకు అతీతంగా నిజమైన లబ్దిదారులకు ఇళ్లు అందేలా చూస్తామన్నారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆస్తి, కుటుంబ తగాదాలతోనే చిన్నాన్న కుటుంబం పై హత్యయత్నం

**చిన్నాన్న కుటుంబం పై హత్యయత్నం**
**విచక్షణారాహితంగా కత్తితో ముగ్గురి పై దాడి**
**గోదావరిఖని ఏసీపీ మడత రమేష్**



**యైటింక్లయిన్ కాలనీ/గోదావరిఖని, ఫిబ్రవరి 20, (నినాదం):**
రెండు కుటుంబాల మధ్య ఉన్న ఆస్తి, కు టుంబ తగాదాలతోనే నిందితుడు రామ్ దూత్ చిన్నాన్న కుటుంబం పై హత్యయత్నానికి పాల్పడినట్లు గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ తెలిపారు. శు క్రవారం ఏసీపీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో హత్యయత్నానికి పాల్పడిన నిందితున్ని అరెస్ట్...వివరాలు వెల్లడిం చారు. వివరాల్లోకి వెళితే...నిందితుడు గాడిచెర్ల రామ్ దూత్ తన తాత రాయమల్లు కట్టించిన ఇంటిలో పెద్ద కుమారుడు సారయ్య కుటుంబం ఒక భాగం లో, చిన్న కుమారుడు శ్రీనివాస్ కు టుంబం మరో భాగంలో ఉంటున్నారు. శ్రీని వాస్ పదకొండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన భార్య సుమిత్రి, కుమా రుడు ప్రణయ్ (22), కుమార్తె సువర్చలా, సుమిత్రి తల్లి కొమురమ్మ అక్కడే ఉంటు న్నారు. నిందితుడు రామ్ దూత్ తండ్రికి ఫిట్స్, బీపీ సమస్యలు, తల్లికి గుండె సమస్య లు ఉన్నాయి. పిన్ని సుమిత్ర కిరాణా దుకా ణంలో సిగరెట్లు, గుట్కా పాన్ మసాలా అమ్ముతుండగా, అక్కడే సిగరెట్ త్రాగడం వల్ల వచ్చే పొగ కారణంగా తమ ఆరోగ్యం దెబ్బతింటోందని రామ్ దూత్ కుటుంబం పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ విషయంపై తరచూ గొడవలు జరి గాయి. నిత్యం జరుగుతున్న వివాదాలను ఆసరా గా చేసుకున్న నిందితుడు రామ్ దూత్ బాబాయ్ కుటుంబ ఆస్తి పై కన్నెసాడు.బాబాయ్ కుటుం బ సభ్యులను చంపితే ఆస్తి మొత్తం తమకే వస్తుందని దురబుద్ధితో వారిని చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో గత సంవత్సరం అక్టోబర్ 5న అమెజాన్ ద్వారా కొబ్బరి బోండాలు కొట్టే కత్తి కొనుగోలు చేసి ఇంట్లో దాచుకున్నాడు. హత్యకు గల కారణా లను ఒక నోటు బుక్కులో కూడా రాసుకు న్నాడు. నిందితుని పథకంలో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున సుమారు 5 గంటలకు పిన్ని సుమిత్ర నిద్ర లేచి బాత్రూం కు వెళ్లగా నిందితుడు కత్తితో పక్కింట్లోని బాబాయ్ ఇంటికి వెళ్లి పడుకుని ఉన్న ప్రణయ్ ఛాతీ, భుజాలు, మెడ పై దాడి చేశాడు. అరుపులు విన్న సుమిత్ర తల్లి కొమురమ్మ అడ్డుకోగా ఆమె దాడి చేయగా ముఖం, చెవి, చేతి పై గాయాలు అయ్యాయి.బాత్ రూమ్ నుండి బయటకు వచ్చిన సుమిత్రి పై కూడా దాడి చేయగా ముఖం, చేతుల పై తీవ్ర గాయాలు అయ్యాయి.బాధితుల అరుపులతో ఇరుగుపొరుగు నిందితున్ని అడ్డుకుని కత్తి లాక్కొన్నారు. దీనితో పోలీసులను అలర్ట్ చేసి గాలింపు చర్యలు చేపట్టగా నిందితుడు ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్ వద్ద దాకుని బస్ స్టాండ్ కు వెళ్తున్నాడు అనే సమాచారంతో ఇన్స్పెక్టర్ ఇంద్రాసేనా రెడ్డి వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించినట్లు పేర్కొన్నారు.

## మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా ఉమా రాణి

**-ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**



**నిజామాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 20 (నినాదం) :**
నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గా కూరగాయల ఉమారాణి శు క్రవారం తన చాంబర్ లో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాక మాట్లాడుతూ మేయర్ గా బాధ్యతలు చేపట్టిన ఉమారాణికి అభినందనలు తెలి పారు. స్థానిక సంస్థల్లో గ్రామపంచా యతీ ఎన్నికల్లో 116, మున్సిపాలిటీలో 7 కార్పొరేషన్ లో కాంగ్రెస్ పార్టీని ఆదరించిన ప్రజలందరికీ ధన్యవా దాలు తెలిపారు. రాష్ట్ర మంత్రివర్గ సభ్యులు అందరు కలిసి 40 రోజుల్లో మున్సి పాలిటీలు కార్పొరేషన్లలో ఉపాధి అవకా శాలను మెరుగు పరుస్తూ నిర్ణయం తీసుకుని అభివృద్ధి చేయడం జరుగుతుం దన్నారు. 2014 తెలం గాణ బిల్లును రాజ్యసభలో బిల్లు పాస్ చేసుకున్న రోజు తెలంగాణ ఆకాంక్ష ప్రజల ఆకాంక్ష 29 రాష్ట్రంగా చిన్న రాష్ట్రంగా తెలంగాణ అభివృద్ధిలో ముందుకు పోవడం జరు గుతుందన్నారు. 2047 విజన్ పేరుతో తెలంగాణ ముందుకు పోవడం జరు గుతుం దని, నీళ్లు నిధులు నియామకాల పేరుతో ఏదైతే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందో దాని ప్రకారం ముందుకు పోవడం జరుగుతుంద న్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్ని రకాలుగా సహకరించాల్సిన అవసరం ఉం దని, ఇక్కడ ఉన్న కేంద్ర మంత్రులు ఎంపీలు అందరూ తెలంగాణ అభివృద్ధికి సహకరించా లన్నారు. నరేంద్ర మోడీ తెలంగాణ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని, బీజెపి పార్టీ ఇప్పుడైనా తెలంగాణపై శీతకన్ను వదిలిపెట్టా లన్నారు. సోనియా గాంధీ నాయకత్వంలో తెలంగాణ సాధించుకోవడం జరిగిందని, తెలంగాణ ఇచ్చినందుకు సోనియాగాంధీకి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ కొరకు అసువులు బాసిన ఉద్యమకారులు అందరికీ నివాళు లర్పించారు. 250 గజాల స్థలాన్ని ఉద్యమకారులకు ఇవ్వడం జరుగుతుందని, తెలంగాణ మ్యానిఫెస్టోలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం జరుగుతుం దన్నారు. తెలంగాణ ఉద్యమం కోసం జైళ్ళకు వెళ్లినవారు కేసులు ఎదుర్కొన్నవారు ప్రాణాలు అర్పించిన వారందరికీ నివాళులర్పిస్తూ వారికి ఇచ్చిన హామీల నెరవేర్చడం జరుగుతుం దన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి మంత్రివర్గములో సబ్ కమిటీ ఏర్పాటు చేసి వారికి అన్ని విధాలుగా ఆదుకోవడం జరుగుతుందన్నారు. పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ మేయర్ గా, డిప్యూటీ మేయర్ గా ప్రమాణస్వీకారం చేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఒక్క ముదిరాజ్ బిడ్డను ఇక్కడ మేయర్ చేయడం జరిగిందనీ, కాంగ్రెస్ పార్టీని ఆదరించిన నిజామాబాద్ నగర ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. నిజామాబాద్ ఇంచార్జిగా ఉన్న ఉత్తంకుమార్ రెడ్డి ప్రత్యేక నిధులు తీసుకురావాల్సిందిగా కోరారు. నిజామాబాద్ అభివృద్ధికి కావలసిన నిధులను ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో తీసుకు వచ్చి అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన మేయర్ డిప్యూటీ మేయర్ కార్పొరేటర్ ల అందరికీ అభినందనలు తెలిపారు. ఎంపీ అరవింద్ కులం పేరుతో మతాల పేరుతో మాట్లాడడం బంద్ చేయాలని, ఇప్పుడు ఎక్కడ పార్లమెంట్లో బిజెపి పార్టీ కనబడడం లేదని, ఇప్పుడైనా నిజామాబాద్ అభివృద్ధి తోడ్పడాలని కోరా రు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, నూడా చైర్మెన్ కేశ వేణు, మాజీ ఎమ్మెల్యే ఆకుల లలిత, జావిద్ అక్రం, రత్నాకర్ తదితరులున్నారు.

## జవహర్ ఎత్తిపోతల పథకం పనులను
## పరిశీలించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్





**మధిర, ఫిబ్రవరి 20 (నినాదం):**
తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కృషితో మధిర మండలంలోని వంగవీటి గ్రామం వద్ద వైరా నదిపై 630 కోట్ల రూపాయలతో నిర్మించ తలపెట్టిన జవహర్ ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ బండారు నరసింహారావు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జవహర్ ఎత్తిపోతలతో చివరి భూములకు జలసిరి అని తెలిపారు. ఖమ్మం జిల్లాలోని సాగర్ జలాలకు చివరి ఆయకట్టుగా ఉన్న మధిర, ఎర్రుపాలెం మండలాలకు ప్రస్తుతం సాగర్ జలాలు మూడో జోన్ లో సరఫరా అవుతున్నాయని, ఈ రెండు మండలాలకు సాగర్ నీటిని రెండోజోన్లో సరఫరా చేసేందుకు వీలుగా రెండు మండలాలకు సాగర్ జలాలను రెండో జోన్ నుంచి తరలించేందుకు మధిర మండలంలోని వైరా నదిపై వంగవీటి గ్రామంలో 630 కోట్ల రూపాయలతో ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 50 వేల ఎకరాలకు సాగర్ జలాలను అందిస్తారని ఈ కార్యక్రమం వచ్చే సంవత్సరం నాటికి పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. మధిర ఎరుపాలెం మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ అవులూరి సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ చిట్టిబాబు ప్రసాద్, ఉపాధ్యక్షులు శీలం శ్రీనివాస్ రెడ్డి, అను మోలు వెంకట కృష్ణారావు, చొప్పకట్లపాలెం సర్పంచ్ బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు బాణావతి రమణా నాయక్, గుడేటి బాబురావు, అద్దంకి రవికుమార్, మాజీ సర్పంచ్ కర్నాటి రామారావు, వెంకయ్య బాబు, నిడమానూరు వంశీ, తోమాటి నవీన్ రెడ్డి, పతే పరుపు సంగయ్య, బిట్ర వద్దండయ్య, మైలవరపు చక్రి, గోపాల్ రెడ్డి తదీతరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో మానాల మోహన్ రెడ్డి సుడిగాలి పర్యటన





**ఆర్మూర్, ఫిబ్రవరి 20 ( నినాదం) :**
బాల్కొండ నియోజకవర్గం లోని ఆయా మండల కేంద్రాల్లో, ఆయా గ్రామాలలో పలు వివాహ శుభా కార్యాలకు, పలువురు కాంగ్రెస్ నాయకుల పరామర్శలు, చత్రపతి శివాజీ జయంతి వేడుకల్లో జయంతి ఉత్సవాలను నిర్వహించడం, పడిగల గ్రామంలో, బాల్కొండ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవాలు నిర్వహిం చారు. గత రెండు రోజులుగా రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి సుడిగాలి పర్యటన చేపట్టారు. వేల్పూర్ మండలంలోని పడగల్ గ్రామంలో, బాల్కొండ మండల కేంద్రంలో ఇంద్రమ్మ ఇండ్ల పథకం కింద పూర్తయిన ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్ళను ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. బాల్కొండ మండల కేంద్రంలో చత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, చత్రపతి శివాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. మోర్తాడ్ మండలంలోని శెట్టిపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు రంజిత్ కుమారుని వివాహానికి ఆయన విచ్చేసి వివాహ వేడుకలను తిలకించి నూతన వధూవరులను ఆశీర్వదిం చారు. అనంతరం భీంగల్ గ్రామ కాంగ్రెస్ నాయ కులు అశోక్ కుమారుని వివాహ కార్యక్రమానికి విచ్చేసి నూతన వధూవరులను రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి ఆశీర్వదించారు. వేల్పూర్ మండలంలోని అంక్సాపూర్ గ్రామంలో రైతు రాజకీయ నాయ కులు పోరుటి గంగయ్య మృతి చెందిన విష యాన్ని తెలుసుకొని శుక్రవారం రోజున అంతక్రి యల్లో పాల్గొని, వారి కుటుంబ సభ్యులను రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట వేల్పూర్ మండల ఏఎంసి చైర్మన్ ముత్యం రెడ్డి, వైస్ చైర్మన్ నర్సారెడ్డి, సర్పంచ్ నల్ల రాజు, ఉప సర్పంచ్ గైని నరేందర్, సర్పంచ్ తిట్ల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకు లు బట్టి మధు, ఏనుగు చిన్నారెడ్డి, వేల్పూర్ రాజేందర్, గడుకోల్ రమేష్, కొత్తూరు మైపాల్, దేగాం రాములు, ఆయా మండలా ల, ఆయా గ్రామాల పాలకవర్గ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.